క్లుప్తంగా

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



వెలిజర్లలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: బీజేపీతోనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, గంట్లవెల్లి, కమ్మదనం, పెద్దచిల్కమర్రి, వెలిజర్ల, కొండన్నగూడ, దూసకల్ గ్రామాల్లోని 15 పోలింగ్ బూత్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సభ్యత్వ నమోదులో వేగం పెంచాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు నరేందర్ రెడ్డి, సుధాకర్, అభిగౌడ్, నారాయణరెడ్డి, ప్రవీణ్, యాదయ్య, మల్లేశ్, లక్ష్మణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద చెట్లను తొలగించండి



మలుపు వద్ద పెరిగిన చెట్లు

కొత్తూరు: మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు ఏపుగా పెరగడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు, ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో అటు పంచాయతీరాజ్, ఇటు ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలంలోని సిద్ధాపూర్ నుంచి కోళ్లపడకల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న మూలమలుపుల వద్ద రోడ్లకిరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మలుపుల వద్ద రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతం పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీన ఏఐటీయూసీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో 1920 అక్టోబర్ 31న ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. అప్పటి నుంచి కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కార్మికుల పక్షాన హక్కుల కోసం ఎన్నో పోరాటలు చేసి ఎన్నో కార్మిక చట్టాలను తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. కార్మికులందరూ కలిసి ఈ 105వ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 31న చేవెళ్ల మండల కేంద్రంలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ జరుగుతుందని, ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.శివయ్యలు ఉన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

కొందుర్గు: రైతులు యాసంగి సీజన్‌లో నాటుకోవడానికి శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కృష్ణ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెజి–11, జాకి–9218, ఎన్‌బీఇజి–49 రకాల శనగ విత్తనాలు 25కిలోల బస్తా రూ.2250లు ధర ఉంటుందని, అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో విత్తనాలు పొందాలని సూచించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

గ్రామాల్లో కొనసాగుతున్న వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం



మొయినాబాద్: అమీర్‌గూడలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని అమీర్‌గూడలో శనివారం ఆయన పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వమే ముందు జాగ్రత్తగా నివారణ టీకాలు వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాలమిత్ర శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా వేయించాలి

షాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి, బోడంపహాడ్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో 25 రోజుల పాటు జరుగుతుందన్నారు. రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



షాబాద్: బోడంపహాడ్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రైతు సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: రుణమాఫీ బుక్‌లెట్‌ను ఎమ్మెల్యేకు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీకి సంబంధించిన బుక్‌లెట్‌ను శనివారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన డిజిట్ క్రాప్ బుకింగ్ సర్వేపై వ్యవసాయ శాఖ అధికారులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఫరూఖ్‌నగర్ పరిధిలో రైతులు వేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రుణామాఫీ రాని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ అర్హులైన ప్రతి రైతుకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధరను అందిస్తుందన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ.. రైతులు వేసిన పంటలను నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేను తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేలో పంట వివరాలను నమోదు చేసేందుకు అధికారులు రైతు పొలంవద్దకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవయసాయ సంచాలకులు రాజారత్నం, ఏఈఓ తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

షాద్‌నగర్: కళాశాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాంరెడ్డి, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, దంగు శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, బస్వం, కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.

ఎల్‌ఓసీలు అందజేత

కేశంపేట మండలానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామానికి చెందిన పూజకు రూ.2.50లక్షలు, తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన తిరుపతయ్యకు రూ.2.50లక్షలు విలువ చేసే ఎల్‌ఓసీలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయన్నారు. ఈ పత్రాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, నాయకులు గూడ వీరేశ్, భాస్కర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, రమేశ్, ముత్యాల, రామకృష్ణ, ఖాజాపాషా, హరి, రాజేందర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో ఎమ్మెల్యే కాలె యాదయ్య



రేవంత్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం రేగడి మైలారంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంతో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు ఉన్నారు. మైలారం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందటంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వర్గీకరణపై నిర్లక్ష్య ధోరణి సరికాదు

ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను

శంకర్‌పల్లి: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణి సరికాదని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భాను అన్నారు. ఈ నెల 29న తుక్కుగూడలో జరుగనున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని పలు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. లేదంటే విద్యా, ఉద్యోగాల్లో మాదిగలు ఎంతో నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుస్వామిని కలిసిన మండల నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల నుంచి శబరిమలకు మహా పాదయాత్ర చేస్తున్న గురుస్వామి ఉమాశంకర్‌రెడ్డిని కర్నూల్ జిల్లాలో మండల నాయకులు కలిశారు. శనివారం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లా పెద్దవేడుకు చేరుకుంది. ఈ పాదయాత్ర చేస్తున్న గురుస్వామిని అక్కడికి వెళ్లి కలిసి ఆయన పాదయాత్రకు మద్దతు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ పాదయాత్ర విషయాలను తెలుసుకున్నారు. గురుస్వామిని కలిసిన వారిలో ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, పామెన మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి, దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా, మల్కాపూర్ గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రాసేనారెడ్డి, శివకుమార్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులను గురుస్వామి సన్మానించారు.

ఇంటింటికీ ఇంకుడుగుంత నిర్మించుకోవాలి

ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



ఇంకుగుంతల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్

కొందుర్గు: ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో మురుగునీరు ప్రవహించకుండా ఇంకుడు గుంతల్లో ఇంకిపోయాలా చూడాలన్నారు. దీంతో దోమలు, ఈగల బెడద తగ్గుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రాములు, టీపీ వినోద్ కుమార్, ఈసీ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ
- విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ సదస్సు



మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ట్రెడెక్స్ స్పీచ్‌లో విద్యార్థులు ఓపిక, పట్టుదల కలిగి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అవకాశం ఉందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెడెక్స్ ఈవెంట్ కార్యక్రమాన్ని జాతీయస్థాయిలో థీమ్ పవర్ ఆఫ్ పెర్సిస్టెన్స్ ఆన్ ఎల్‌డింగ్ ఫోర్స్ నేపథ్యాల నుంచి వివిధ వ్యక్తుల సందేశాల సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జేడీ లక్ష్మీనారాయణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. పట్టుదల, శక్తి, కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని తప్పనిసరి సాధిస్తారని సూచించారు. పట్టుదలే ప్రతికూల పరిస్థితుల్లో సత్యాన్ని వెలికితీయడానికి, లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందన్నారు. దేశ విదేశాలతో మారుతున్న కాలాన్ని పరిగణిస్తూ విద్యార్థులు ఆవిష్కరణలను అనుసరిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ట్రెడెక్స్ ఇంటర్నేషనల్ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల వ్యక్తులు, విద్యార్థులకు దిశానిర్దేశ మార్గాలను సూచించారు. కార్యక్రమంలో విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డీన్ డా.పద్మజారెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, ఏఓ వెంకటాచలం, అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీలత, ట్రెడెక్స్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఓబులేష్‌తో పాటు వివిధ సంస్థల వక్తలు విప్ అపక్ అల్లనేర్డి ప్రతినిధి దేబబ్రతా, ఎల్కో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ వనితా దాట్ల, కమల్ వ్యవస్థాపకుడు మెకర్ గ్లోబల్ డైరెక్టర్ క్రవిందర్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎంపీడీఓ అపర్ణ



మొక్కలు నాటుతున్న ఎంపీడీపీ అపర్ణ, తహసీల్దార్ ఏండీ అన్వర్

షాబాద్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ ఏండీ అన్వర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో వన్ సేవింగ్ బ్యాంక్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో గ్రామ వీడీసీ కమిటీ ఆధ్వర్యంలో 500ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. నాటిన మొక్కను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామంలో మొక్కలు నాటేందుకు స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, గ్రామస్తులు సాయికిరణ్, సతీశ్, శేఖర్, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, రాంచందర్ రావు, తదితరులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



మాట్లాడుతున్న ఏసీపీ కిషన్‌గౌడ్



రక్తదానం చేస్తున్న యువకులు

చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్

షాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ రక్తపు బొట్టు ఓ మనిషి ప్రాణాన్ని కాపాడుతుందని చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా షాబాద్ సీఐ కాంతారెడ్డి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ బ్లెడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం పోలీసు అమరులకు నివాళులర్పించారు. 205 మంది యువకులు 200 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్‌రెడ్డి, సతీశ్ కుమార్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కోరారు. శనివారం మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో శాస్త్రవేత్తలు రైతులతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు పలు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో పంటల్లో వచ్చే చీడపీడలు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు అధికారుల సూచనలతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే మంచి లాభాలు సాధిస్తారని వివరించారు. అంతేకాకుండా పంటల సాగులో సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. రసాయన ఎరువుల వాడకంతో అటు పొలాలు కాలుష్యంగా మారడంతో పాటు రైతులు అనారోగ్యాలకు గురవుతారని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి, అరుణ, నిర్మల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు

మొయినాబాద్: నాగర్‌కర్నూల్‌లో ఆదివారం జరిగే మాలల ఆత్మగౌరవ సభకు మాలలందరూ పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాలల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలందరూ ఐక్యతతో హక్కులను సాధించుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్‌లో జరిగే ఆత్మగౌరవ సభకు ప్రతీ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, రామస్వామి, యాదగిరి, రాజు, కృష్ణ, రామచంద్రి, శ్రీనివాస్, నర్సింలు తదితరులు ఉన్నారు.

మాలలందరూ ఏకతాటిపైకి రావాలి

నందిగామ: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరుగుతుందని, అన్యాయాన్ని అరికట్టాలంటే మాలలందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంబేడ్కర్ సంఘం నాయకుడు దార లింగం పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం పలువురు అంబేడ్కర్ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. నేడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పీవీ నర్సింహారావు ప్రాంగణంలో జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేసేందుకు ప్రతీ మాల కులస్తుడు తప్పక హాజరుకావాలన్నారు. రాష్ట్రంలో మాల జనాభా తక్కువగా ఉందని, వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదనే దుష్ప్రచారం జరుగుతుందని ఆరోపించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మాలల ఐక్యత చాటాలని, హలో మాల.. చలో నాగర్‌కర్నూల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏకుల వెంకటయ్య, మాల సంఘం, అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో కట్టపై చెట్ల తొలగింపు



సురేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామం నుంచి కోళ్లపడకల్‌కు వెళ్లే ప్రధాన దారిలో ఉన్న పచ్చచెరువు కట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లను స్థానిక యువనేత లింగారం సురేశ్‌గౌడ్ శనివారం సొంత ఖర్చులతో తొలిగించారు. గత కొన్నేళ్ల నుంచి చెరువు కట్ట వద్ద చెట్లను తొలగించని కారణంగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. దీనికితోడు రాత్రి వేళల్లో కట్టపై నుంచి ఉన్న రోడ్డుగుండా ప్రయాణం చేయడానికి వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో ఎస్‌బీపల్లి తాజా మాజీ సర్పంచ్ ప్రభాకర్ సూచనతో సురేశ్‌గౌడ్ సొంత డబ్బులు వెచ్చించి కట్టపై చెట్లను జేసీబీలతో తొలిగించి రోడ్డును అభివృద్ధి చేశారు. దీంతో స్థానికులతో పాటు కోళ్లపడకల్‌కు చెందిన నాయకులు సురేశ్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, అనంతరెడ్డి, ప్రవీణ్, సత్తయ్య, అర్జున్, నందు, రాజశేఖర్, మల్లేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి

యునైటెడ్ వే ఆఫ్ జిల్లా అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనుయాదవ్



షాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో రోబోటిక్స్, సైన్స్ కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీనుయాదవ్, తదితరులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు తమవంతు కృషిచేస్తామని యునైటెడ్ వే ఆఫ్ జిల్లా అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనుయాదవ్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ బాలుర, షాబాద్ బాలికల, తాళ్లపల్లి, మన్మర్రి, సర్దార్‌నగర్, రేగడిదోస్వాడ, హైతాబాద్, పోతుగల్ ఉన్నత పాఠశాలలకు యునైఎడ్ వే ఆఫ్ హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు వారి సహకారంతో రోబోటిక్స్, సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే వారి కుటుంబాలు మీ మేలును మరిచిపోరన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ ప్రాజెక్ట్ లీడ్స్ పవిత్ర, అమ్మల్, ఫీల్డ్ ఆఫీసర్లు సంతోష్, పవన్, ప్రవళిక, నవిత, మౌనిక, కవిత, భిక్షపతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు తదతరులు ఉన్నారు.